డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను సాలూరు రూరల్ సిఐ బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సిఐగా బాధ్యతలు స్వీకరించిన బాలకృష్ణ రాజన్న దొర నివాసంలో కలిశారు. -ప్రజాశక్తి , సాలూరురూరల్

సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ; సదస్సుకు హాజరైన రైతులు, నాయకులు

# కాలువ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

- సుజల స్రవంతి సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విఎస్ఆర్
- సమస్య పరిష్కారమయ్యే వరకు కలిసి వస్తామన్న మాజీ ఎమ్మెల్యేలు
- మండలిలో చర్చిస్తామన్న ఎమ్మెల్సీ రఘురాజు
- సదస్సుకు తరలి వచ్చిన రైతులు

**ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి**

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ డిజైన్ మార్పు చేయాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు రైతులతో కలిసి పోరాడతామని టిడిపికి చెందిన గజపతినగరం, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యేలు కెఎ.నాయుడు, కోళ్ల లలిత కుమారి చెప్పారు. త్వరలో జరగనున్న శాసన మండలి సమావేశంలో చర్చించడంతోపాటు అవసరమైతే సిఎంను కలిసి సమస్యను విన్నవిస్తానని వైసిపికి చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హామీ ఇచ్చారు. సుజల స్రవంతి కాలువ డిజైన్ మార్పుచేసి, ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ భూ నిర్వాసిత పోరాట కమిటీ (ఎపి రైతు సంఘం) ఆధ్వర్యాన తాటిపూడి జలాశయం వద్ద సదస్సు నిర్వహించారు. పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎస్.కోట, గజపతి నగరం నియోజకవర్గాలకు చెందిన వందలాది మంది రైతులు తరలివచ్చారు. కాలువ నిర్మాణం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష వైఖరిని మూకుమ్మడిగా అడ్డుకోవాలని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తొలుత శ్రీనివాస రావు మాట్లా డుతూ కాంట్రా క్టర్ల ప్రయోజ నాలు, కమీషన్ల కక్కుర్తి కోసమే సుజల స్రవంతి కాలువ అలైన్ మెంట్ ఇష్టా రాజ్యంగా రూపొందించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాజెక్టుల వద్ద ఇటువంటి వైఖరి ప్రదర్శించడం వల్ల వర్షపునీటికి కొట్టుకుపోవడం లేదా ముంపు సమస్య ఉత్పన్నం కావడం వంటివి చూస్తున్నామన్నారు. ప్రస్తుతం సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ మార్పుచేయకపోతే ఇక్కడ కూడా అదే పరిస్థితి ఎదురౌతుందన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ సమస్యను సాగునీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పుడు సానుకూలంగా స్పందించినప్పటికీ, ఆచరణలో ప్రత్యామ్నాయ మార్గం అన్వేషించలేదన్నారు. గ్రామసభల్లో రైతులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు సాగడం సరికాదని అన్నారు. మొండిగా ముందుకు సాగితే ప్రతిఘటించేందుకు రైతులంతా సిద్ధం కావాలన్నారు. ఎపి రైతు సంఘం నిర్వాసితుల తరపున పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ఓవైపు ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉందంటూనే మరోవైపు ప్రాజెక్టు పేరిట దుర్వినియోగానికి సిద్ధమౌతోందని విమర్శించారు. ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే చిన్నచిన్న సాగునీటి వనరులను వినియోగంలోకి తెచ్చేందుకు జిల్లాకు రూ.30వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో ఏదేశంలోనూ లిఫ్ట్ ఇరిగేషన్లు విజయవంతం కాలేదని, సుజల స్రవంతి విషయంలో ఇదే జరగబోతుందని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఎగువ ప్రాంతం నుంచి కాలువ ఏర్పాటు చేయాలని, తద్వారా శాశ్వత ప్రాతిపదికన సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. రైతులను దివాలా తీయించి, కాలువలు నిర్మించడం వల్ల ఉపయోగం లేదన్నారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడుతున్న రైతులపై బెదిరింపులకు పాల్పడడం ప్రభుత్వానికి, అధికార పార్టీ నాయకులకు తగదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేదని, ఎన్నో రూపాల్లో భారం మోపిందని అన్నారు. ఎమ్మెల్సీ రఘు రాజు మాట్లా డుతూ రైతులను ఒప్పించి భూము లు తీసుకోవాలి తప్ప, నొప్పించి తీసుకోవడం ఎవరికైనా తగద న్నారు. 'అలైన్ మెంట్ తయారు చేసిన ఇంజి నీర్లకు బహుశా భూముల విలువ, భూములతో రైతులకు ఉన్న అను బంధం గురించి తెలీదేమో' అని విమర్శించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ అలైన్‌మెంట్ మార్పుచేసే వరకు రైతులకు అండగా నిలబడి పోరాడతామని, వెంటనే ప్రభుత్వం దీనిపై స్పందించకపోతే రైతు లను మరింత గా కదిలించి భవిష్యత్తు కార్యా చరణ రూపొంది స్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో అనకాపల్లి జిల్లా రైతు సంఘం నాయకులు గండి నాయని బాబు, తాటి పూడి ఆయుకట్టు పోరాట కమిటీ నాయకులు రాయవరపు సత్యం, లోకపు ఆది నారాయణ మూర్తి, పలువురు తాజా, మాజీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, బొండపల్లి మాజీ జెడ్‌పిటిసి సభ్యులు బి.బాలాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజు

మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

రైతు సంఘం నాయకులు రాంబాబు

మాజీ ఎమ్మెల్యేకెఎ నాయుడు

విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

# రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఫస్ట్ రావాలి

## ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల ముగింపు సభలో కలెక్టర్

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మొదటి స్థానం రావాలని క్రీడాకారులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారుల ప్రతిభ ఎంతో ఆదర్శనీయమన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో గెలిచి జిల్లా స్థాయికి ఎంతో కష్టపడి వచ్చారని, అదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో కూడా గెలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. గ్రామాల్లో ఉండే క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఇంత మంచి కార్యక్రమం నిర్వహించిందన్నారు. గ్రామస్థాయి నుండే ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఓ మంచి పరిణామమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గెలిచిన క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీలకు మొదటి బహుమతిగా రూ.60వేలు, రెండో బహుమతిగా రూ.30వేలు, మూడో బహుమతిగా రూ.10వేలను, బ్యాడ్మింటన్‌కు మొదటి బహుమతి రూ.35 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించిన జిల్లా ప్రాధికారిక సంస్థ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు నెలలుగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గ్రామస్థాయిలో మొదలైయ్యి, జిల్లా స్థాయికి చేరుకొని ఈరోజుతో జిల్లా స్థాయి పోటీలు ముగింపుకి వచ్చాయన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

**గెలుపొందిన క్రీడాకారులు**

**క్రికెట్** :పురుషుల విభాగం పోటీల్లో విన్నర్ సాలూరు, రన్నర్ పార్వతీపురం, మూడో స్థానంలో కురుపాం
బాలికల విభాగం : మొదటి, రెండవ, మూడవ బహుమతి సాలూరు, కురుపాం, పాలకొండ
**ఖోఖో పురుషులు**: మొదటి, రెండు, మూడువ బహుమతి పాలకొండ, సాలూరు, కురుపాం,
**బాలికలు** : మొదటి,రెండు, మూడవ బహుమతి పాలకొండ, సాలూరు, కురుపాం,
**వాలీబాల్ పురుషులు:** మొదటి, రెండు, మూడవ బహుమతి పార్వతీపురం, పాలకొండ, సాలూరు.
**బాలికలు:** కురుపాం, పాలకొండ, సాలూరు.
**కబడ్డీ పురుషులు** : మొదటి, రెండు, మూడవ బహుమతి పాలకొండ, పార్వతీపురం, కురుపాం,
**బాలికలు :** మొదటి, రెండు,మూడవ బహుమతి పాలకొండ, సాలూరు, కురుపాం,
**బాడ్మింటన్ పురుషులు :** మొదటి, రెండు, మూడవ బహుమతి సాలూరు, పార్వతీపురం, కురుపాం,
**బాలికలు** : కురుపాం, పార్వతీపురం, పాలకొండ జట్లు గెలుపొందాయి.

గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి చెక్ ను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, పిఇటి అధ్యక్షులు పి.రామకృష్ణ, ఎస్‌జిటి సెక్రటరీ డిటి గాంధీ, కోఆర్డినేటర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తూ విజయోత్సవాలు జరుపుకుంటున్న అంగన్‌వాడీలు

# అంగన్‌వాడీల విజయోత్సవ సభ

**ప్రజాశక్తి - సీతానగరం**

మండల కేంద్రంలోని అంగన్వాడీ కార్యకర్తలు సహాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ సభను నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహం ఎదుట కేకును కట్‌చేసి పంచిపెట్టారు. 42రోజులంతా కలిసికట్టుగా సమ్మె విజయవంతంగా నిర్వహించామని, ప్రభుత్వం కూడా 13డిమాండ్లను పరిష్కారం చేయడం వల్ల అందరికీ మంచి జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, నాయకులు మడక సత్యవతి, రెడ్డి లక్ష్మి, పార్వతి, పద్మ, శైలజ, సునీత, సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్‌గా ప్రేమ ప్రసన్నవాణి

**ప్రజాశక్తి - సాలూరు**

ఎన్నికల బదిలీల్లో భాగంగా స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రేమప్రసన్న వాణిని నియమించారు. అంతకు ముందు విశాఖపట్నం నగర కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వెంకటరమణను ఇక్కడ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన కొద్ది రోజుల్లో విధుల్లో చేరతారని సమాచారం ఇక్కడకి అందింది. అయితే ఆయన విధుల్లో చేరడానికి అయిష్టత వ్యక్తం చేశారా లేక ఇంకేదైనా కారణం వల్లనో ఆయన్ను వేరొక చోటకి బదిలీ చేశారు. ఇక్కడ పూర్తి అదనపు బాధ్యతలతో కమిషనర్‌గా పనిచేస్తున్న టి.జయరాం తిరిగి పాలకొండ నగరపంచాయితీ మేనేజర్‌గా వెళ్ళిపోనున్నారు.

# కొటియాలో అభివృద్ధి పనులు పరిశీలన

**ప్రజాశక్తి -సాలూరు**

కొటియా గ్రామాల్లో ఒడిశా కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ శుక్రవారం సాయంత్రం పర్యటించారు. ఈ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పర్యాటక ప్రదేశమైన మలై లో రిసార్ట్, కేఫ్ నిర్మాణాలను పరిశీలించారు. కొటియా గ్రామాల్లో జరుగుతున్న పేదల గృహ నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముడకారులో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జోలిపట్టి విరాళాలు అడుగుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

# విరివిగా విరాళాలిచ్చి సహకరించండి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

రాష్ట్రంలో ప్రజలను మోసగించి, డబ్బులిచ్చి ఓట్లు వేయించుకొనేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్న నేటి పరిస్థితుల్లో వాటికి భిన్నంగా సిపిఎం ప్రజల వద్దకే విరాళాల కోసం వెళ్లడం సాహసోపేతమైన చర్యని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయనగరంలోని కలెక్టర్ కూడలి, కనపాక ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి సిపిఎం నాయకులు, కార్యకర్తలు విరాళాలు సేకరించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు జోలి పట్టి ప్రతి ఇంటికి, షాపునకు వెళ్లి విరాళాలు అభ్యర్థించడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు వ్యాపారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాన్ని ప్రజా సేవకు కేంద్రంగా మార్చాలనే ఈ ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మిగతా రాజకీయ పార్టీలు మాదిరిగా కార్పొరేట్ల వద్ద, ఎన్నికల బాండ్ల రూపంలో నిధులు తీసుకోవడం లేదని, ప్రజల కోసం పనిచేస్తున్నాం కనుక వారి వద్దకే వెళ్లి విరాళాలు వసూలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన తహశీలార్లు వీరే..

**ప్రజాశక్తి పార్వతీపురం రూరల్**

త్వరలో జరగబోవునున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాకు ఎన్నికల కమిషన్ కొత్త తహశీల్దార్లను నియమించింది. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్‌కుమార్ జిల్లాలో వారికి మండలాలను కేటాయిస్తూ నియామక ఉత్తర్వులు శుక్రవారం విడుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి

ఎ. వేణుగోపాల్ - కురుపాం
కె. ఆనందరావు - పార్వతీపురం
బి రాజ్యలక్ష్మి - బలిజిపేట
ఎం ఆనంద్ కుమార్ - సాలూరు
కే జయ - గరుగుబిల్లి
పి శ్రీనివాసరావు - భామిని,
కె.జయప్రకాష్ - వీరఘట్టం
కె. వరహాలు - పాలకొండ
ఎస్ఎ మహేశ్వర రావు- సీతంపేట,
పి బాల - పాచిపెంట,
ఎ.సింహాచలం - మక్కువ,
బి ఎస్ ఎస్ సత్యనారాయణ -గుమ్మలక్ష్మీపురం
జివి జనార్ధన్ - సీతానగరం
ఆర్ రమేష్ కుమార్ - కొమరాడ

# ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

**పార్వతీపురం** : సాధారణ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషను ఆదేశాలు, కొత్తగా అందజేసిన హేండ్ బుక్‌లో గల నియమాలు ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటు చేర్పులు, తొలగింపులు, ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రక్రియ, పత్రికల్లో వచ్చిన వార్తలపై తీసుకున్న చర్యలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్, జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, కె.ఆర్.సి.సి. డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడు పాల్గొన్నారు.

# స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు

**ప్రజాశక్తి - సీతంపేట**

స్థానిక ఐటిడిఎ పరిధిలో అర్హత కలిగిన 17 మంది ఎస్‌జిటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శుక్రవారం తెలిపారు. వీరిలో తెలుగు-2, హిందీ-2, ఇంగ్లీష్-1, గణితం-2, బయోలాజికల్ సైన్స్-3, సాంఘిక శాస్త్రం-4, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం నలుగురికి ఉద్యోగోన్నతులు కల్పించామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పదోన్నతి పత్రాలను టీచర్లకు పిఒ అందజేశారు. కార్యక్రమంలో డీడీ ఎం.అన్నాదొర, ఎఎంఒ కోటిబాబు, సూపరింటెండెంట్ దేశ్, ఎవి శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆశావాహినిని... ఆశీర్వదించండి

**ప్రజాశక్తి - మక్కువ**

సాలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరపున టికెట్ ఆశిస్తూ వచ్చానని, మీ అందరి ఆశీర్వాదాలు కావాలని, ఉద్యోగం వదులుకొని ప్రజాసేవకు వచ్చానని ఆశావాహి ఎం.తేజోవతి అన్నారు. మండలంలోని ఓ కల్యాణ మండపంలో మండల మాజీ టిడిపి అధ్యక్షులు పెంట తిరుపతిరావు అధ్యక్షతన మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుటుంబం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పనిచేస్తూ వచ్చిందన్నారు. ఇటీవలే ఉపాధ్యాయ వృత్తి నుండి 25 ఏళ్ల సర్వీస్ ఉన్నప్పటికీ వదులుకొని ప్రజాసేవ చేయాలను ఉద్దేశంతో పార్టీలో చేరానని ఆమె అన్నారు. సాలూరు నియోజకవర్గంలో టిడిపి తరపున రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండలంలోని తిరుపతిరావు నేతృత్వంలో అందరి అభిప్రాయాలు పంచుకుంటూ ముందుకు వెళ్తానని అన్నారు. ఒకవేళ టిక్కెట్టు మరొకరికి ఇచ్చినా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని అన్నారు

**ముత్యాలమ్మ? పోలమాంబ?ఎక్కడైనా సిద్ధం!**

సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గుమ్మడి సంధ్యారాణి తనపై చేసిన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడానని, అలాగే కోట్లాది రూపాయలు వెనకేసుకున్నానని ఆరోపణలకు మండలంలో ఉన్న పార్టీ శ్రేణులకు అంతా తెలుసునని మండల మాజీ టిడిపి అధ్యక్షులు పెంట తిరుపతిరావు అన్నారు. తాను 2019లో పార్టీ మారడానికి గల కారణాలు అందరికీ తెలుసునన్నారు. అప్పట్లో వైసిపి నాయకులు స్థానికంగా అట్రాసిటీ కేసులు పెట్టేందుకు ప్రయత్నించగా అప్పటికే ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక వైసిపి నేతలతో లోపాయికారిగా చేతులు కలిపి వికటాహాసం చేశారన్నారు. 2019 ఎన్నికల్లో వైసిపితో అనైతికంగా లాలూచీపడి రెండు కోట్ల రూపాయల వరకు దండుకున్నారని ఆరోపించారు. మామిడిపల్లిలో టిడిపి ఇచ్చిన నిధులు ఖర్చు చేయలేదంటూ కొంత సొమ్ము స్వాహా చేశారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ప్రస్తుతం టిడిపి అధిష్టానం చేపడుతున్న ఐవిఆర్ఎస్ సర్వేలో తేజోవతి పేరు కూడా అడుగుతున్నారని, అలాంటప్పుడు ఆమెకు పార్టీతో సంబంధం లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ ఇప్పటికే తేజోవతి కోసం చివరి వరకు సాలూరు టికెట్‌కు ప్రయత్నిస్తానని చెప్పారని ఆయన మాట ప్రకారం తాము కూడా తేజోవతికి మద్దతు తెలుపుతామన్నారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఇతర పార్టీ శ్రేణులంతా తమ వైపు ఉన్నారని, ఎవరూ లేరంటూ వీరందరికీ పార్టీతో సంబంధం లేదంటూ చేసిన తప్పుడు ఆరోపణ లపై ముత్యాలమ్మ తల్లి లేదా శంబర పోలమాంబ ఆలయాల వద్ద ప్రమాణానికి సిద్ధమేనని ఆయన సవాల్ విసిరారు.

**డిపాజిట్ రాని వారికి అధ్యక్ష పదవా..?**

స్థానిక సంస్థల ఉపఎన్నికల్లో కనీసం డిపాజిట్లు కూడా రాని వ్యక్తి సర్పంచ్ స్థానానికి కూడా పోటీ చేయలేని గుళ్ల వేణుగోపాలనాయుడుకు మండల టిడిపి అధ్యక్ష పదవి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తూ టిడిపికి స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యతిరేకంగా పనిచేశారని ఆయన ఆరోపించారు. వారిని వెనుకేసుకొస్తూ సంధ్యారాణి కాంగ్రెస్ మార్కు గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆధారాలతో జాతీయ నాయకత్వానికి తెలియజేస్తామన్నారు.

## పరిచయ కార్యక్రమంలో తేజోవతి

పరిచయ సభలో మాట్లాడుతున్న తేజోవతి

# అందరి సహకారంతో పట్టణాభివృద్ధి

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

ప్రజా ప్రతినిధులు, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు, సహచర అధికారుల సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్లో కొత్తగా మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను కార్యాలయంలో పలు విభాగాల్లో గల అధికారులు పుష్ప గుచ్చాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాజువాక జివిఎంసి కార్యాలయంలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. రెండో సారి ఈ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఈ మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉందని, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లు, పాలకవర్గ సభ్యుల సూచనలు, సలహాలు మేరకు పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలో 30 వార్డులను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తానని తెలిపారు. పట్టణంలో ప్రధాన సమస్యలైనా తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, కట్టడాలపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వీటితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరువ చేసేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ ఇన్చార్జి మేనేజర్, రెవిన్యూ అధికారి దిబ్బా రూబేను, టిపిఒ కనకారావు, డిఇ కిరణ్ కుమార్, జెఎఒ అశోక్, ఎఇలు జి.ఆనంద్, సన్యాసిరావు, ప్రజారోగ్య విభాగం అధికారి సిహెచ్.మురళి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పి.నారాయణరావు, జి.వినయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, పుష్ప, కిరణ్, జూనియర్ అసిస్టెంట్లు హేమలత, పద్మ, శంకర్, హేమంత్, అనంత్,కమిషనర్ సింహాచలంకు అభినందనలు తెలియజేశారు.

**ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్**

**పార్వతీపురంరూరల్** : స్థానిక పురపాలక సంఘం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సింహాచలం శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని, ఇప్పటికే గతంలో పురపాలక సంఘంలో పనిచేసిన అనుభవం ఉన్నందున ఎక్కడ ఏ సమస్య ఉన్నది అన్నది మీకు పూర్తిస్థాయి అవగాహన ఉంటుందన్నారు. కావున మరింత సమర్ధవంతంగా పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

## ఇంటింటికీ కుళాయిల కోసం ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఇంటింటికీ కుళాయిలు కోరుతూ ఏర్పాటు చేయాలని మండలంలోని నర్సిపురంలో పలు వీధులకు చెందిన ప్రజలు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇఒపిఆర్‌డి ఎన్.కృష్ణుడుకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని వీధుల్లో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రధాన వీధికి ఆనుకొని ఉన్న మఠ్రివీధి, ఆగూరు వీధి, కుమ్మరి వీధి, చాకలి వీధుల్లో కొళాయిలు ఏర్పాటు చేయలేదన్నారు. గ్రామంలో అందరిలాగే పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నా, సుమారు 500 కుటుంబాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ వీధుల్లో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేయాలని అన్నారు.

## విధులు సక్రంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధ్యతగా పనిచేయాలని, ఎవరిపైనా ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శులు సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్తు ఎఒ వై.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి రవణమూర్తి, మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు అందుబాటులో ఉన్న సచివాలయలకు వెళ్లి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ లబ్ధిదారులను కోరారు. శుక్రవారం స్థానిక 1,2,3,4 సచివాలయాల్లో జరుగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఇళ్లస్థలం పొందిన ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం గతంలో ఇచ్చిన పట్టా, ఆధార్ కార్డు పట్టుకొని సచివాలయాలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు వీఆర్వోలు అప్పలనాయుడు, సురేష్, ఎల్లయ్య, ఇఒ వి.రామచంద్రరావు, లబ్ధిదారులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డిఎంఒ జగన్మోహన్

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రత ముఖ్యమని జిల్లా మలేరియా టి.జగన్మోహన్రావు ప్రజలకు సూచించారు. మండలంలోని రేగులపాడు, కత్తుల కవిటిలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఇంటి పరిసరాలో ఉన్న వాడుకలో లేని,ఉపయోగం లేని నీటిని, పాడైపోయిన వస్తువుల్లో నీటి నిల్వలు గుర్తించి తొలగింపచేశారు. నీటి నిల్వలు ఉండడం వల్ల దోమలు ఉత్పత్తి చెందడం వల్ల మలేరియా, డయేరియా, డెంగీ తదితర వ్యాధులు సంభవిస్తాయని అన్నారు. ముఖ్యంగా టైర్లు , రుబ్బురోలు, కొబ్బరిచిప్పలు, ఫ్రిడ్జ్ వెనుక ఉన్న డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం పాఠశాల సందర్శించి విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు, సలహాలు అందజేశారు. ఆయనతో పాటు బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చప్పబుచ్చింపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

## పోలింగ్ కేంద్రాలను డిఇఒ పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పోలింగ్ కేంద్రాలైన అల్లురువు, కొండ బుచ్చంపేట, శంబర పాఠశాల భవనాలను డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. పాఠశాల భవనాల్లో ర్యాంపులను, నీటి వసతి, మరుగుదొడ్ల పనితీరును ఆయన పరిశీలించారు. ఎలక్షన్ సమయంలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఎంఇఒలు పెంట సత్యనారాయణ, శ్యామసుందర్రావును ఆదేశించారు.

## ఐటిడిఎ సిబ్బందికి సికిల్ సెల్ ఎనిమీయా పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల అన్ని కార్యాలయాల ఉద్యోగులు, ఇతర సిబ్బందికి ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ఆదేశాల మేరకు శుక్రవారం సికిల్ సెల్ ఎనిమీయా రక్త పరీక్షలు చేశారు. ఇందులో భాగంగా 79 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఐటిడిఎ పరిధిలో గల అన్ని గిరిజన గ్రామాలు, పాఠశాలల్లో సికిల్‌సెల్ ఎనిమీయా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యుటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ టి.శ్రీవరం కోరారు. ఉన్నత విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు భద్రగిరి గిరిజన గురుకుల బాలికల, ఎపిఆర్ బాలుర కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. డిగ్రీ కళాశాలలో ఉన్న గ్రూపులు విద్యార్థులకు వివరించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఇంటర్‌లో మంచి మార్కులు తెచ్చుకొని డిగ్రీ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే విద్యార్థులు వెట్ ల్యాండ్స్ ఆవశ్యకత గుర్తించాలని ప్రిన్సిపల్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బోటనీ అధ్యాపకులు సత్యారావు ఆధ్వర్యంలో వెట్ ల్యాండ్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వెట్ ల్యాండ్స్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీవరం

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఇఒ-2 ఎం.వెంకటరమణకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి మాట్లాడుతూ దీర్ఘకాలంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలేదని, దీంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కష్టతరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వంట నిర్వహణకు అవసరమైన గ్యాస్ బండ, పొయ్యిలు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం తరచూ మెనూ మారుస్తున్నప్పటికీ మెస్ ఛార్జీలు చెల్లించడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెనూ ఛార్జీలు, మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 5న కలెక్టరేట్ వద్ద జరుగుతున్న ధర్నాలో మండలానికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ మధ్యాహ్న భోజన నిర్వాహకుల మండల యూనియన్ నాయకులు యాళ్ల సావిత్రి, ఎస్.లక్ష్మి, అప్పనమ్మ, చిన్నమ్మ, సీతారత్నం తదితర వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

**కొమరాడ** : మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయుకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికసంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ఉన్న ఎంఐఎస్ కోఆర్డినేటర్ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు సునీత, లక్ష్మి మాట్లాడుతూ మండలంలోని వివిధ స్కూల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. దీంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. ఇప్పటికైనా మెనూ ఛార్జీలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 5న కలెక్టరేట్ వద్ద జరుగుతున్న ధర్నాలో మండలానికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొన్నారు.

సీతానగరం :ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

# బడ్జెట్‌లో రైతులకు మొండిచేయి

ప్రజాశక్తి - పాచిపెంట

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని, నిధులివ్వకుండా మొండిచేయి చూపిందని మండలంలోని పాంచాలి వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిపిఎం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి ఏ ఉపయోగం లేకుండా పోయిందని, ఉపాధి హామీ కేటాయింపులు లేకుండా చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశ సంపద కాపాడాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, ఉపాధి హామీని సక్రమంగా అమలు చేయాలని, పరిశ్రమలు తెరిపించాలని, ప్రత్యేక హెూదా ఇవ్వాలని, విభజన హామీ అమలు చేయాలని ఈనెల 7, 8తేదీల్లో ఢిల్లీలో జరిగిన ధర్నాకు ప్రజలు కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.అప్పలనాయుడు, బర్ల సూర్యనారాయణ పోలినాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పల్లె రాము, ముల్లు వెంకటి, తత్తర్లు పాల్గొన్నారు.

**కొమరాడ :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పాత చింతకాయ పచ్చడి మాదిరిగా ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు, దళితులకు, వ్యవసాయ కూలీలకు, కార్మికులకు, రైతాంగానికి ఎటువంటి లాభం లేకుండా ఈ బడ్జెట్ ఉందని కావున ఈ బడ్జెట్ గొప్పలకే తప్ప ప్రజలకు ఉపయోగం లేదని అన్నారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం నాయకులు రామారావు, ఉపేంద్ర పాల్గొన్నారు.

# సారాతో పట్టుబడిన కారు వేలం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వ ఆదేశాల మేరకు నాటు సారాతో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు పార్వతీపురం ఎఎస్పీ సునీల్ షియోరాన్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గతంలో నాటుసారా తరలిస్తూ పట్టుబడిన కారు వేలంపాటలో ఆయన పాల్గొన్నారు. 2003కు చెందిన మారుతి ఆల్టో కారు ప్రభుత్వ ధర రూ.10వేలు కాగా, వేలంపాటలో రూ.12,500కు మండలం చెందినవారు పాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ నాటుసారా తరలింపు, అమ్మకాలు, తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా అమ్మకాలపై, తరలింపులపై దాడులు అధికం కావడంతో ప్రస్తుతం నాటుసారా రవాణా అమ్మకాలు తగ్గాయని తెలిపారు. కావున ఇప్పటికైనా నాటుసారా అక్రమ మద్యం రవాణాలు చేసి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా అక్రమంగా అమ్మకాలు తరలింపు చేసినా ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వేలం పాటలో ఎస్సై నీలకంఠం, హెడ్ కానిస్టేబుల్ రాజారత్నం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# మహిళా పక్షపాతి ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

ప్రస్తుత వైసిపి ప్రభుత్వం మహిళా పక్షపాతని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. స్థానిక ఐటిడిఎ క్రీడా ప్రాంగణం ఆవరణలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. మండలానికి సంబంధించి వైయస్సార్ ఆసరా నాలుగో విడతలో 925 స్వయం సహాయక సంఘాల్లో గల 10,503 మంది సభ్యులకు రూ.5.33 కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఈ నాలుగు విడతలు కలిపి సీతంపేట మండలానికి రూ.21.32కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిపారు. అనంతరం సిఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో నిలదొక్కుకోవడంతో పాటు, ఆర్థిక స్వావలంబన దిశగా వారిని ముందుకు తీసుకుని వెళ్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు అక్కచెల్లెమ్మలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మహిళలను మోసం చేసిన సిగ్గులేని వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ఆదినారాయణ, వైస్‌ఎంపిపి కె.సరస్వతి, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, జెఎస్ కో-ఆర్డినేటర్ లక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, ఆర్డినేటర్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, ఎంపిడిఒ గీతాంజలి, ఎపిడి రమణ, ఇఒపిఆర్‌డి సత్యం, ఎటిఎం విజయకుమారి, సూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

**పాలకొండ:** స్థానిక నగర పంచాయతీకి సంబంధించి నాలుగో విడతలో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం 563 స్వయం శక్తి సంఘాల ఖాతాల్లోకి రూ.4.46కోట్లు జమైనట్టు ప్రభుత్వ విప్ పి.విక్రాంత్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహిళలకు పెద్దపేట వేసిందన్నారు. పాదయాత్రలో స్వయం శక్తి సంఘాల మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు మాట తప్పకుండా రుణమాఫీ చేశారన్నారు. అదే అభిమానంతో మళ్లీ సిఎంగా జగన్మోహన్‌రెడ్డిని ఎన్నిక చేసుకోడానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం : సిఐ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించి ప్రశాంతంగా ఎన్నికల కార్యక్రమం నిర్వహణ ధ్యేయంగా పనిచేస్తానని కొత్తగా బాధ్యతలు చేపట్టిన పార్వతీపురం రూరల్ సిఐ కె.రవికుమార్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాజాంలో సిఐగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై వచ్చిన తను గతంలో సీతానగరంలో పనిచేసిన అనుభవం ఉన్నందున పార్వతీపురం నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందని అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తుగా సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తానని, నాటు సారా రవాణా అమ్మకాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాటి నిరోధానికి కృషి చేస్తానని అన్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు వారికి అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై దినకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌బికెల్లో పురుగు మందులు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పదమాయవలస రైతు భరోసా కేంద్ర పరిధిలో గల చాకిరాపల్లిలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ సమక్షంలో పురుగుమందులు రైతులకు శుక్ర వారం పంపిణీ చేశారు. ఇకపై రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు రైతులకు అందించడం జరుగుతుందన్నారు. వీటితోపాటు ప్రస్తుతం పురుగు మందులు కూడా రైతులకు అందజేస్తామన్నారు. ముందస్తుగా రైతులకు ఏ పంటలకు ఏ రకమైన తెగులు పురుగు మందులు అవసరమో గుర్తించి ఆ మందుల పూర్తి ఖరీదును రైతు భరోసా కేంద్రం ద్వారా ఎపి సీడ్స్ వారికి నగదు రుపేనా జమచేసి ఇండెంట్ పెడుతున్నామన్నారు. ఆ ఇండెంట్‌లో పెట్టిన పురుగు లేదా తెగులు మందులను మన గ్రోమోర్ సెంటర్ (కోరమండల్) ద్వారా ఆర్‌బికెల్లో పెట్టి రైతులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేపనూనె, క్లోరిపైరిపాస్ మందులను సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలో వరి, మొక్కజొన్న పంటకు ఏ రకమైన పురుగు, తెగులు మందులు అవసరమో ముందస్తుగా రైతులు ఆర్‌బికెలకు తెలియజేసిన పక్షంలో వీటిని కూడా అందజేస్తామన్నారు.

రైతులకు పురుగు మందులు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పాల్

కార్యక్రమంలో సర్పంచ్ కురిటి మోహన్, మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ నాయుడు, విఎఎ చోడవరపు కామేష్, కోరమండల్ కంపెనీ ఎఎంఆర్ఒ మహేష్, బలిజిపేట గ్రోమోర్ మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

# దిశా యాప్‌పై విద్యార్థినులకుఅవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి దిశా చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లా దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లావణ్య, తన సిబ్బందితో కలిసి విద్యార్థినులకు బాల్యవివాహాల వల్ల జరిగే అనార్థాలు, సోషల్ మీడియా వల్ల జరిగే అనార్థాలు, మానవ అక్రమ రవాణా, మహిళలపై జరిగే నేరాలు, దిశాయాప్ ఉపయోగం, వినియోగంపై వివరించారు.

వాహనాలకు స్టిక్కర్లు అతికిస్తున్న రవాణాశాఖ అధికారులు

# టిడిపితోనే బిసిలకు న్యాయం : శత్రుచర్ల

ప్రజాశక్తి - కొమరాడ

టిడిపితోనే బిసిలకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మండలంలో జంఝావతి కూడలిలో మండల టిడిపి అధ్యక్షులు ఎస్. శేఖర్ పాత్రుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన జయహో బిసి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అంటేనే బీసీలకు ఆదరణ, బిసిల పార్టీగా గుర్తింపు పొందిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బిసిలకు ఉన్న సబ్సిడీ రుణాలు, కార్పొరేషన్లు పూర్తిగా నాశనం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి, రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ ప్రజలను నట్టేట ముంచిన ఘనత జగన్మోహన్రెడ్డిదేనని, కావున రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డి.రామకృష్ణ, డి.వెంకటనాయుడు, జి.సుదర్శనరావు, ఎన్.మధుసూదనరావు, గంగరేగు వలస ఎంపిటిసి గంట వెంకటనాయుడు, గుణానుపురం ఎంపిటిసి ఎ.సంతోషి, నాయకులు మర్రాపు పురుషోత్తం, కృష్ణబాబు, పి.వెంకటనాయుడు, జనసేన నాయకులు కె.మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న మాజీ మంత్రి శత్రుచర్ల, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖాధికారి అధ్వర్యంలో శుక్రవారం పార్వతీపురంలో ట్రాన్స్‌పోర్టు వాహనాలకు రెఫ్లెక్టర్ టేప్ అతికించి వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్ ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, ఐఎస్ఐ మార్క్ కలిగిన హెల్మెట్ ధారణ, ఓవర్ స్పీడ్, ఇతర రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణ పరిధిలోని కొత్తవలసలో రవాణా, పోలీస్, ఆర్యోగశాఖలు, ఆర్‌టిసి సిబ్బంది అధ్వర్యంలో అన్ని రకాల వాహనాల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన హెల్మెట్ ధరించడం, హెచ్‌ఎస్‌ఆర్‌పి నెంబర్ ప్లేట్లు ఉపయోగించడం ఆవశ్యకతను, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, హెల్మెట్ ధారణ, ఓవర్ స్పీడ్, ఇతర రహదారి భద్రతపై పూర్తి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గ, పట్టణ ఎస్సై సంతోషి కుమారి, ఎంవిఐ శశి కుమార్, ఎఎంవిఐ సత్యనారాయణ, పరిపాలన అధికారి సీతారాం, రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది, ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుల్, హెూంగార్డులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపిలోకి బాలగొడబ ఎంపిటిసి చేరిక

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బాలగొడబ ఎంపిటిసి సభ్యులు వంగపండు నీలవేణి, ఆమె భర్త నీలకంఠంతో కలిసి శుక్రవారం పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర చేతుల మీదగా కండువా కప్పుకొని టిడిపిలో చేరారు. శుక్రవారం బాలగొడబలో నిర్వహించిన భవిష్యత్తు గ్యారెంటీ బాబు షూర్టీ కార్యక్రమంలో భాగంగా ఈ చేరికలు జరిగాయి. ముందుగా ఇన్చార్జి విజయ్‌చంద్ర గ్రామంలోని కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి టిడిపి అమలు చేయబోయే పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్యుల బతుకులను భారం చేస్తూ అధిక ధరలు అస్తవ్యస్త పరిపాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారని అందుకు టిడిపికి రాష్ట్రంలో లభిస్తున్న ఆదరణే సాక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు బోను చంద్రమౌళి, పోల సత్యనారాయణ, ముప్వల పాదాల నాయుడు సూర్యనారాయణ భాస్కరరావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 'అభిలాష'లో సభ్యులుగా చేర్పించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

చదువుకున్న యువతకు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరమైన గ్రామ సచివాలయాల్లోని అభిలాష గ్రంథాలయాల్లో వారిని ప్రత్యేక యాప్ ద్వారా సభ్యులుగా చేర్పించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపిడిఒ అకిబ్ జావేద్ సచివాలయ సిబ్బందిని కోరారు. కలెక్టర్ మానస పుత్రిక అభిలాష గ్రంథాలయాల పనితీరును పరిశీలించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఎమ్మార్‌నగరం, ఎల్ఎన్ పురం సచివాలయాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అభిలాష గ్రంథాలయాల ఏర్పాటు ఇప్పటికే జిల్లాలో 97, పార్వతీపురం మండలంలో 9 సచివాలయాల్లో ఏర్పాటు జరిగిందని, సచివాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బీరువాలో విలువైన పుస్తకాలను ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు పుస్తకాల కోసం ప్రత్యేక యాప్ ద్వారా యువతను సభ్యులుగా చేర్పిస్తున్నారని అన్నారు. గ్రామీణ యువతకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఈ అభిలాష గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను మెరుగుపర్చుకోవాలని వారు కోరారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట/పాలకొండ**

పాలకొండ, సీతంపేట శాఖా గ్రంథాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం చదువుతున్న యవతీ, యువకుల కోసం గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాధికారి బి.గణేష్ బాబు తెలిపారు. గ్రూప్‌లకు సంబంధించిన, సచివాలయం, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, కానిస్టేబుల్, అర్థమెటిక్, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో గల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పుస్తకాలను చదివి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి తెలిపారు.

## పలువురు ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ అభివద్ధి అధికారిగా ఈశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈయన బదిలీపై శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, కెకె కుమార్ వర్మ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంపిడిఒగా రమేష్‌నాయుడు**

**బలిజిపేట :** మండల పరిషత్ అధికారిగా ఎం.రమేష్ నాయుడు శుక్రవారం విధులకు హాజరయ్యారు. ఈయన శ్రీకాకుళం జిల్లా పలాస మండలం నుండి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ కె.విజయలక్ష్మి బదిలీపై టెక్కలి మండలం వెళ్లారు.

**వీరఘటం ఎంపిడిఒగా సాల్మన్ రాజ్**

**వీరఘట్టం :** స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.సాల్మన్ రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ డి.శ్వేత చీపురుపల్లి బదిలీ అయ్యారు. సాల్మన్‌రాజు గుమ్మలక్ష్మీపురంలో ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

## చుక్క నీరివ్వని కుళాయిలు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని గిరిజన గ్రామాలైన డోకులుగూడ, ఇసుక గూడ, నల్లారాయి గూడ గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయిలు అమర్చి నెలలు గడుస్తున్నా కుళాయిల నుంచి నీరు వచ్చే పరిస్థితి లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు ఆందోళన వ్యక్తం చేశారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలోని 200 గ్రామాల్లో కాంట్రాక్టు పనులు ప్రారంభించి, ఎక్కడా నీరు ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్లుఎస్ డిఇ జోక్యం చేసుకుని పనులు వేగవంతం చేసి, గిరిజనులకు తాగునీరందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## పోక్సో కేసులో బాలనేరస్తునికి శిక్ష

**సాలూరు:** పట్టణంలోని చిన్న వీధిలో 2020 సెప్టెంబర్‌లో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన బాలనేరస్తునికి శిక్ష విధిస్తూ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ తీర్పు చెప్పారని టౌన్ ఎస్ఐ కెవి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ బాలనేరస్తుడ్ని సత్ప్రవర్తన కోసం బాల నేరస్తుల విద్యాలయానికి పంపిస్తూ తీర్పు వెలువడిందన్నారు. యువత చదువుకునే వయస్సులో విద్యపై దృష్టి సారించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే భవిష్యత్తు నాశనమవుతుందని సూచించారు.

## పులిగుమ్మిలో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిగుమ్మిలో టిడిపి నాయకులు పడాల భూదేవి ఇంటింటా ప్రచారం చేపట్టారు. గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టిడిపి పాలనలో గిరిజనులకు అందే సంక్షేమ పథకాలు గురించి వివరించారు. వైసిపి పాలనలో గిరిజనులకు తెలుగుదేశం చంద్రబాబు కల్పించిన సుమారు 20 పథకాలు తొలగించారన్నారు. గృహనిర్మాణ సామాగ్రి ధరలు పెరిగిపోవడం వల్ల ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఉండిపోతున్నాయని అన్నారు. గ్రామానికి సరైన రహదారి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూశానన్నారు. నీటి సమస్య ఉందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ మరో రెండు నెలల్లో టిడిపి పాలన రానుందని, మన గిరిజన సమస్యల పరిష్కారం కోసం, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. అనంతరం టిడిపి మ్యానిఫెస్టోలో ఉన్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు.

## వృద్ధ కళాకారునికి సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని తుమరాడకు చెందిన చాకరాపల్లి ఈశ్వరరావుకు చిలకలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మజ్జి గౌరీశంకర్రావు సమక్షంలో శుక్రవారం ఘనంగా 96వ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావుకు దుస్సాశాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈశ్వరరావు తన జీవితయాత్రలో ఎన్నో సన్మానాలు పొంది 4వేలకు పైగా స్టేజీలపై ప్రదర్శనలు చేసి ఇటు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. వృద్ధాప్యంలోనూ తన వంతు పాత్రను తను చేస్తూ వృత్తికి న్యాయం చేస్తూ ముందుకు కొనసాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.